సాక్షి నిజామాబాద్

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



నిరుద్యోగులకు తీపి కబురు

జిల్లాలో టీఆర్టీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- 10లో ▸



లక్కీ ప్రయాణికులు..

రక్షాబంధన్ రోజు ప్రయాణించిన వారికి ఆర్టీసీ లక్కీ డ్రా నిర్వహించి హైదరాబాద్‌లో బహుమతులు అందజేసింది.

- 12లో ▸

గరిష్టం/కనిష్టం
25.5 /22.7

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జక్రాన్‌పల్లి ఎంపీడీవో అరెస్ట్

ఖలీల్‌వాడి : జక్రాన్‌పల్లి ఎంపీడీవో నటరాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ధర్పల్లి మండలంలోని ఓ తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్‌పై అత్యాచారం చేసినట్లు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ధర్పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ఏసీపీ కిరణ్‌కుమార్ విచారణ చేపట్టారు.

ఖాళీలు 973, బదిలీకి అర్హులు 2300



నిజామాబాద్ అర్బన్ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన శుక్రవారం ముగిసింది. 4088 దరఖాస్తులు రాగా, 2300 మంది టీచర్లు అర్హులుగా ఉన్నట్లు డీఈవో అధికారులు గుర్తించారు. 973 ఖాళీలు మాత్రమే ఉన్నాయి. బదిలీలకు సంబంధించి ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. అర్హుల జాబితా కంటే ఖాళీల సంఖ్య తక్కువ ఉంది. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అందరికీ బదిలీలు చేయాలని కోరుతున్నారు.

దొంగ ఓట్ల ఏరివేతలో నిర్లక్ష్యాన్ని సహించం

- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి



ఖలీల్‌వాడి : దొంగ ఓట్ల ఏరివేతలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.జిల్లాలో పలుచోట్ల అధికార పార్టీ నా యకులు, అధికారులు కుమ్మక్కై దొంగ ఓట్ల ను నమోదు చేస్తున్నారని అన్నారు. బోధన్‌లోని శక్కర్ నగర్‌కు చెందిన 87వ బూత్‌లో ఇప్పటివరకు 800 ఓటర్లు ఉంటే ఇప్పుడు కొత్తగా ఆన్‌లైన్‌లో 782 కొత్త అప్లికేషన్లు వచ్చాయన్నారు.అప్లికేషన్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి.ఓటర్లు ఎక్కడ ఉంటున్నారో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆలాగే 88వ బూత్‌లో 538, 95వ బూ త్‌లో 509, 96వ బూత్‌లో 539, 97వ బూత్ లో 344, 99వ బూత్‌లో 510, 100 బూత్‌లో 119 కొత్త అప్లికేషన్లు ఎక్కడి నుంచి వచ్చాయో అధికారులు సమీక్షించాలన్నారు. ఒకవే ళ నకిలీ ఆధారాలతో ఎవరైనా కొత్త ఓట్లను సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఒకవేళ నకిలీ ఓట్ల వెనుక అధికారపార్టీ నాయకులు గానీ, అధికారులు ఉంటే చర్య లు తప్పవన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

15.5 మి.మీటర్ల వర్షపాతం నమోదు

సుభాష్‌నగర్ : గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 15.5 మిల్లీమీటర్ల సగటు వర్షపా తం నమోదైంది. అత్యధికంగా నవీపేట్‌లో 47.5 మిల్లీమీటర్లు, రెంజల్‌లో 45.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శుక్రవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. రానున్న రెండ్రోజులు జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వర్షపాతం (మిల్లీమీటర్లలో..)

మండలాలు	వర్షపాతం		
		సాలూర	30.0
వేల్పూర్	16.0	బోధన్	28.8
నవీపేట	47.5	ఎడపల్లి	29.1
జక్రాన్‌పల్లి	15.1	రుద్రూరు	18.6
ఆలూరు	23.3	చందూరు	10.9
రెంజల్	45.4	మోపాల్	12.8
డొంకేశ్వర్	10.5	నిజామాబాద్‌రూరల్	20.6
వర్ని	18.3	నిజామాబాద్ నార్త్	18.4
నందిపేట్	14.7	మోస్రా	16.8
మాక్లూర్	22.6	నిజామాబాద్ సౌత్	21.3

అసైన్డ్ భూములకు రుణం లేదు



- గతంలో ఇచ్చినా ఇప్పుడు ససేమిరా అంటున్న బ్యాంకర్లు
- జిల్లాలో 35 శాతానికి పైగా అసైన్డ్ భూములే..
- పోడు పట్టాలకూ మొండి చేయే..
- లక్ష్యం చేరని పంట రుణాల పంపిణీ

ఇందల్వాయి: అసైన్డ్ భూములకు పంట రుణాలు ఇచ్చేందుకు జాతీయ, సహకార బ్యాంకులు విముఖత చూపుతున్నాయి. దీంతో రుణమాఫీ పొందిన రైతులు తిరిగి పంటరుణాలు పొందేందుకు బ్యాంకులకు వెళితే నిరాశే ఎదురవుతోంది. గతంలో అసైన్డ్ భూములకు పంట రుణాలు ఇచ్చినా మార్ట్‌గేజ్ రుణాలు మాత్రం ఇచ్చేవారు కాదు. ఇప్పుడు ఉన్నతాధి అధికారుల ఆదేశాల మేరకు అసైన్డ్ ల్యాండ్‌లతో పాటు కొత్తగా మంజూరు చేసిన పోడు పట్టాలకు కూడా పంట రుణాలు కూడా ఇచ్చేది లేదని బ్యాంకు అధికారులు తేల్చి చేపుతున్నారు.

మాఫీ వర్తించినా ఖాతాల్లో జమకాని డబ్బులు

ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన తర్వాత చాలా మంది రైతుల పంట రుణాలు మాఫీ అయ్యాయి. అయితే తిరిగి రుణం పొందేందుకు రైతులు బ్యాంకులకు వెళితే వారికి చేదు అనుభం ఎదురవుతోంది. కొందరికి మాఫీ వర్తించిన ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. కొందరికి జమ అయినా వడ్డీ చెల్లించేదాకా కొత్త రుణం ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. మరి కొందరిని బ్యాంకు అధికారులు ఇప్పుడు కాదు మరో 15 రోజుల తర్వాత రమ్మని తిప్పి పంపుతున్నారు. దీంతో వానాకాలం పంటల సాగు పూర్తయినా రుణాల పంపిణీ లక్ష్యానికి ఆమడ దూరంలోనే ఉండిపోయింది.

గతంలో రుణాలు అందినా..

జిల్లాలో 5.36 లక్షల ఎకరాల సాగు భూములు ఉండగా అందులో 35 శాతానికి పైగా అసైన్డ్ భూములు ఉన్నాయి. ఈ భూములకు గతంలో రుణాలు అందినా గత మూడు నెలలుగా మాత్రం ఎలాంటి రుణాలు ఇవ్వడం లేదు. ధరణి వెబ్‌సైట్‌లో అసైన్డ్ భూమిగా నమోదైతే చాలు బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. కొందరి రైతుల పట్టా భూములు కూడా ధణిలో ప్రభుత్వ భూములుగా నమోదు అయ్యాయి. దీంతో వారు కూడా పంట రుణాలు పొందలేక పోతున్నారు. ఈ విషయమై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి అన్ని రకాల భూములకు పంట రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



■ ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు దేవాయిగారి సురేందర్ రెడ్డి. ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన ఇతనికి రుణమాఫీ పథకంలో భాగంగా సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో రూ. 71 వేల రుణం మాఫీ అయింది. తిరిగి రుణం పొందేందుకు బ్యాంకుకు వెళితే మీది అసైన్డ్ ల్యాండ్ అని, పంట రుణం ఇవ్వడం కుదరదని తిప్పి పంపారు. స్థానిక సహకార బ్యాంకులో అడిగితే అక్కడ కూడా అసైన్డ్ భూములకు పంట రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో చేసేది ఏమి లేక పంట రుణం ఎక్కడ పొందాలో తెలియక ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వ విధానాల వల్ల ఇతని లాగే జిల్లాలో వేల సంఖ్యలో రైతులు నిరాశ చెందుతున్నారు.

2.85 లక్షల మంది రైతులు.. రూ. 2,437 కోట్ల లక్ష్యం

జిల్లాలో సుమారు 2.85 లక్షల మంది రైతులు ఉన్నారు. వానాకాలం పంట రుణాల కింద వీరికి రూ. 2,437 కోట్లు అందజేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా ఇప్పటి వరకు 58.79 శాతం మంది రైతులకు రూ. 1432 కోట్ల రుణాలు అందించినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

“ అన్ని రకాల భూములకు పంట రుణాలు అందించాలి



బ్యాంకు అధికారులు అసైండ్ భూములకు పంట రుణాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విధానం వల్ల ఎందరో పేద రైతులు పంట రుణాలు పొందలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పంటకాలం పూర్తయినా లక్ష్యం మేర రుణాలు పంపిణీ చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు పంట రుణాలు అందేలా చర్యలు చేపట్టాలి. – ముప్ప గంగారెడ్డి, కిసాన్‌ఖేత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

పోడు పట్టాలకు పంట రుణాలు అందించాలి



నూతనంగా పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయాలి. పేద గిరిజనులు ఆర్థికంగా నిలబడాలంటే పంట రుణాలు తప్పనిసరి. లేదంటే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు గిరిజన రైతులకు న్యాయం చేయాలి. ఈమేరకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– రామవత్ మోహన్ నాయక్, రైతు సమితి మండల అధ్యక్షుడు–ఇందల్వాయి

4 రోజులు @ 25 టీఎంసీలు



పూర్తిస్థాయి నీటి మట్టంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్

- ప్రాజెక్ట్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల ద్వారానే చేరుతున్న నీరు
- ఉదయం 20 వరద గేట్లు ఎత్తి 62 వేల క్యూసెక్కుల నీటి విడుదల

బాల్కొండ: శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి గడిచిన నాలుగు రోజుల వ్యవధిలో 25 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలనే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి వరద నీరు చేరుతోంది. గతంలో మహారాష్ట్ర ప్రాంతంలో వర్షాలు కురిస్తేనే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిండుతుందనే భావన ఉండేది.

ప్రస్తుతం అధిక శాతం నీరు స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వలన వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ అధికారులు చెబుతున్నా రు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి నాలుగు రోజుల నుంచి నిరంతరం వరద నీరు వచ్చి చేరుతుంది. 10500 క్యూసెక్కులతో ప్రారంభమైన వర ద నీరు గరిష్టంగా లక్ష 20 వేల క్యూసెక్కుల వరకు వచ్చి చేరింది. ప్రాజెక్ట్ నుంచి వరదగేట్ల ద్వారా గడిచిన నాలుగు రోజుల్లో 22 టీఎంసీల నీటిని గోదావరిలోకి అధికారులు నీటి విడుదల చేశారు.

149 టీఎంసీల వరద నీరు..


ప్రస్తుత సంవత్సరం జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 149 టీఎంసీల వరద నీరు రాగా 80 టీఎంసీల నీటి విడుదల చేశారు. అందులో వరద గేట్ల ద్వారా జూలై మాసంలో 32 టీఎంసీలు వదలగా, నాలుగు రోజుల్లో 22 టీఎంసీలు మొత్తం 54 టీఎంసీల నీటిని గోదావరి పాలైంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతోంది.

■ ప్రాజెక్ట్‌లోకి ఉదయం 72 వేల క్యూసెక్కులు వచ్చిన వరద రాత్రికి 52 వేలకు పడిపోయింది. ఉదయం 20 వరద గేట్ల ద్వారా 62 వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. రాత్రి నుంచి 14 గేట్ల ద్వారా 44 వేలు క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయకాలువ ద్వార 3 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కులనీరు పోతోంది.

ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం1091(90 టీఎంసీలు) అడుగుల కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

36.33 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టంతో ఉండటంతో ప్రాజెక్ట్ వద్ద గల జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో సామర్థ్యానికి మించి నాలుగు టర్బయిన్ల ద్వారా 36.33 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 23.53 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు.



అలీసాగర్ నుంచి..

ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండలంలోని అలీసాగర్ రిజర్వాయిర్ నిండు కుండలా మారింది. వర్షాలు కురుస్తున్నందున నిజాంసాగర్ ప్రధాన కెనాల్‌లోకి భారీ వరద నీరు చేరడంతో శుక్రవారం 4వ రోజు అలీసాగర్ ఒక గే టు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

హిందూ సంఘటితాన్ని తట్టుకోలేక కుట్రలు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నవీపేట: సనాతన ధర్మాన్ని కాపాడుకునే దిశగా సంఘటితం అవుతున్న హిందూ శక్తిని తట్టుకోలేక కొందరు రాజకీయ నాయకులు కుహనాలు కుట్రలు పన్నుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. నవీపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శివాజీవిగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హిందూ ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి ఊర్లో శివాజీ మహరాజ్‌లు తయారు కావాలని పిలుపునిచ్చారు. ఇందూరు ఖిల్లా జైలు గోడలపై దాశరథి రాసిన కవితల స్ఫూర్తిగా మరోమారు సనాతన ధర్మ రక్షణకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్, లింగంగుట్ట సిద్ధేశ్వర మహారాజ్, శివాజీ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవ సమితి అధ్యక్షులు సాయరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు ద్యాగ సరిన్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రఘునందన్‌రావు

ఎకో టూరిజానికి స్థల పరిశీలన

- హైదరాబాద్ నుంచి వచ్చిన ఫారెస్ట్ అధికారి
- త్వరలో డ్రోన్ ద్వారా సర్వే

డొంకేశ్వర్(ఆర్మూర్) : గోదావరి నది ఒడ్డున ఎకో టూరిజం ఏర్పాటుకు సంబంధించిన స్థల పరిశీలన మొదలైంది. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన డీఎఫ్‌వో రంజిత్ నాయక్ శుక్రవారం డొంకేశ్వర్ మండలం గాదేపల్లికి వచ్చారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించారు. డొంకేశ్వర్, బాల్కొండ, నందిపేట్ మండలాల్లో ఎకో టూరిజం ఏర్పాటు కోసం 26 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూలై నెలలో ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వన్య ప్రాణులు ఎక్కువగా ఏయే ప్రాంతాల్లో సంచరిస్తాయో స్థానిక ఫారెస్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా, రెస్టారెంట్లు, బోటింగ్, వ్యూ టవర్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో స్థల పరిశీలన చేశారు. వాస్తవానికి డ్రోన్ ద్వారా స్థల సర్వే జరగాల్సి ఉండగా, వర్షం కారణంగా డ్రోన్ టీం రాలేదు. స్థల పరిశీలనకు సంబంధించిన వివరాలను సేకరించిన అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు. త్వరలో మరొక అధికారుల బృందం రానుంది. డీఎఫ్‌వో వెంట ఎఫ్ఆర్వో శ్రీనివాస్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుధాకర్, ఎకో టూరిజం సిబ్బంది ఉన్నారు.



గాదేపల్లి వద్ద స్థల పరిశీలన చేస్తున్న డీఎఫ్‌వో రంజిత్ నాయక్, ఇతర అధికారులు

సోయాకు వాన గండం

- కోత దశకు చేరిన పంటకు ముప్పు
- వర్షాలు తగ్గకపోతే గింజలు మొలకెత్తే ప్రమాదం
- ఆందోళనలో రైతన్నలు



డొంకేశ్వర్‌లో వర్షానికి తడిసిన సోయా

డొంకేశ్వర్(ఆర్మూర్) : సోయాబీన్ పంటకు వాన గండం ఏర్పడింది. గత ఎనిమిది రోజులుగా కురుస్తున్న వర్షాలు సోయా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కోత దశకు వచ్చిన పంటను ఏ విధంగా కాపాడుకోవాలో తెలియక కంగారు పడుతున్నారు. మరో నాలుగైదు రోజులు వర్షం ఇలాగే కురిస్తే గింజలకు మొలకలు వచ్చే ప్రమాదముంది. దీంతో పంట ఎక్కడ చేతికి అందకుండా పోతుందోనని రైతుల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలో ఈ ఏడాదికి ఖరీఫ్ సీజన్‌కు గాను 58,714 ఎకరాల్లో సోయా సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అంచనా కంటే కాస్త తక్కువగా 50,187 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. తక్కువ సమయంలో పంట చేతికొచ్చే పొట్టి సోయాలను ఎక్కువ సాగు చేశారు. మొక్క దశలోనే ఉండగా జూలైలో భారీ వర్షాలు పలు చోట్ల సోయాపంటను ముంచేశాయి. దాని తర్వాత ఆగస్టులో వర్షాలు ముఖం చాటేయడంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పంటపై ఆకుమచ్చ తెగుళ్లు దాడి చేశాయి. నాలుగైదు రకాల కంపెనీల విత్తనాలతో సోయాను సాగు చేయగా, ఏ కంపెని విత్తనాలు కూడా తెగుళ్లను తట్టుకోలేదు. దోమ పంటలోని సారాన్ని పీల్చడంతో ఆకులు రంగుమారి కాత కూడా సరిగ్గా కాయలేదు. దీంతో పంట దిగుబడిపై ప్రభావం పడనుందని రైతులు పేర్కొంటున్నారు.

పది రోజుల్లో కోతలు...

తెగుళ్ల దాడి చేయగా, ప్రస్తుతం కోత దశకు వచ్చిన పంటలపై వర్షం దాడి చేస్తోంది. జిల్లాలో దాదాపు 50 శాతం పంట కోత దశకు చేరుకుంది. మరో వారం, పది రోజుల్లో కోతలు కూడా ప్రారంభించాలని రైతులు చూస్తున్నారు. కానీ, వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో పంట కోయకముందే గింజలకు ఎక్కడ మొలకలు వస్తాయోనని భయం పట్టుకుంది. ఒకవేళ వర్షం ఇలాగే కొనసాగితే పంట దిగుబడిపై చాలా ప్రభావం పడనుంది. ఎకరానికి 8–12 క్వింటాళ్లు వచ్చే దిగుబడి కాస్త సగానికి పడిపోయే పరిస్థితి ఉంటుందని చెప్పవచ్చు. ఐతే, ఈ ఏడాది ప్రకృతి సహకరించకపోవడంతో సోయా రైతుల్లో ఆనందం లేకుండా పోయింది. ఇక మార్కెట్‌లో సరైన ధర రాకపోతే చేతికి పెట్టుబడి కూడా అందే పరిస్థితి ఉండదు.

“ వర్షాలు తగ్గకపోతే నష్టమే..



నేను డొంకేశ్వర్‌లో ఆరు ఎకరాల్లో సోయా సాగు చేశాను. ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో పంట కోత దశకు వచ్చింది. తెగుళ్ల దాడితో దిగుబడి తగ్గుతుందని ఆందోళన ఉంటే మరో పక్క వర్షం దాడి చేస్తోంది. వర్షాలు మరో నాలుగైదు రోజుల్లో తగ్గుముఖం పట్టకపోతే పంటను కోయడానికి నేల అనుకూలంగా ఉండదు. గింజలు మొలకెత్తే ప్రమాదం ఉంది.

– గోక గంగారెడ్డి, రైతు, డొంకేశ్వర్

వదంతులు నమ్మొద్దు..

ఖలీల్‌వాడి : గణేశ్ పండగ నేపథ్యంలో ఉత్సవ నిర్వాహకులు ఎలాంటి వదంతులు నమ్మొద్దని పోలీస్ కమిషనర్ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వహించిన 'శాంతి కమిటీ' సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత పోలీసులను అడిగి తెలుసుకోవాలన్నారు. పండుగను శాంతి యుతంగా నిర్వహించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండళ్ల షెడ్ నిర్మాణం, దాని నాణ్యత, కరెంటు సౌకర్యాలు, వర్షం నీరు లోపలికి రాకుండా ప్రతిమలు ఏర్పాటు చేయాలని సూచించారు. గణేశ్ పండుగ, మిలాద్ ఉన్ నబీ ఒకే సమయంలో వస్తున్నందున ప్రతి ఒకరు సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు ఎక్కడఎలాంటి ఆటంకం కలుగకుండా సహకారం అందించాలని కోరారు.

అనంతరం అన్ని గణేశ్ మండళ్ల నిర్వాహకుల సలహాలు, సూచనలు అడిగి పోలీస్ కమిషనర్ తెలుసుకున్నారు. డీసీపీ జయరామ్, ఏసీపీ కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీఐలు, ఎ స్సైలు, సార్వజనిక్ గణేశ్ మండలి కన్వీనర్ బంటు గణేశ్, వివిధ గణేశ్ మండళ్ల నిర్వాహకులు పటేవార్ శ్రీనివాస్, మాస్టర్ శంకర్, చికెన్ శ్రీను, ముత్యాలు, బీక్షపతి, సంతోష్, పంచరెడ్డి శ్రీధర్, శ్యామ్, గోపి, అశోక్, సాయిలు ప్రసాద్ పటేల్, సాయిబాబా, డొక్క శ్యామ్, దాత్రిక పరమేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ, డీసీపీ జయరామ్, ఏసీపీ కిరణ్‌కుమార్

క్లుప్తంగా

బాలల సంరక్షణ అధికారులకు బాలిక అప్పగింత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన ఓ మహిళ 15రోజుల క్రితం విక్రయించిందనే ప్రచారం జరిగిన బాలికను శుక్రవారం స్థానిక పోలీసులు జిల్లా బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు. గోపాల్‌పేటకు చెందిన మహిళ పేదరికంతోపాటు పోషణభారమై తన పెద్దకూతురు నాగలక్ష్మిని లింగంపేట మండలం పొల్కంపేటకు చెందిన వారికి అప్పగించింది. ఈ విషయం బయటకు రావడంతో జిల్లా అధికారులు గురువారం నాగిరెడ్డిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి బాలికను బాలల సంరక్షణ అధికారులకు అప్పగించారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు



ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్ బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తు అందజేశారు. ఆయన వెంట ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, జిల్లా కార్యదర్శి అబ్బి గంగారాం, జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్, ఆర్మూర్ సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, నాయకులు డొంకేశ్వర్ సురేందర్, సురేశ్ నాయక్, ఆలూర్ గంగాధర్, పాన్ శ్రీనివాస్, కార్తిక్ సింగ్ తదితరులు ఉన్నారు.

జడ్జిని కలిసిన సీపీ సత్యనారాయణ



ఖలీల్‌వాడి: నగరంలోని కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీతను నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీస్‌కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కోర్టులో నిందితులను సరైన సమయంలో హాజరుపర్చాలని, విచారణ సమయంలో పోలీసుల పాత్రపై కోర్టు కానిస్టేబుళ్లకు పూర్తి అవగాహన కల్పించడానికి శిక్షణ ఇప్పించాలని సీపీకి సూచించారు. డీసీపీ ఎస్. జయరామ్, ఏసీపీ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు తీపి కబురు

- జిల్లాలో 309 టీఆర్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 20 నుంచి పరీక్షలు



పాఠాలు బోధిస్తున్న టీచర్

నిజామాబాద్అర్బన్: నిరుద్యోగులకు సర్కారు తీపి కబురు వినిపించింది. జిల్లాలో 309 టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురించాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2017లో టీఆర్టీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేసిన ప్రభుత్వం మరోమారు నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లా నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వం ఈ నెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించనుంది. నవంబర్ 20 నుంచి 30వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు నెలల సమయమే ఉన్నందున అభ్యర్థులు పరీక్షలకు సిద్ధం కానున్నారు. టీఆర్టీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్‌తో ఊపిరిపోసినట్లయ్యింది.

తగ్గిన పోస్టులు.. పెరిగిన పోటీ

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు పోటీ తీవ్రంగా ఉంది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 309 టీఆర్టీ పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 96, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 183, లాంగ్వేజ్ పండిత్ 21, పీఈటీలు 9 ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం వీటిని భర్తీ చేయనుంది. కాగా ఇదివరకే టెట్ ఉత్తీర్ణులైన వారి సంఖ్యను పరిశీలిస్తే పెద్ద మొత్తంలో పోటీ పెరిగింది. జిల్లాలో టెట్ ఉత్తీర్ణత అభ్యర్థులు పేపర్–1లో 4880, పేపర్–2లో 5383 మంది ఉన్నారు. ప్రస్తుతం ఈనెల 15న మరోసారి టెట్ నిర్వహించనున్నారు. ఇప్పటికే 12వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారు సైతం ఈ పరీక్షకు హాజరుకానున్నారు. 309 పోస్టులకు సుమారు 20వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

ఆటంకాలు లేకుండా చేపట్టాలి



ప్రభుత్వం ఎలాంటి ఆటంకాలు లేకుండా టీఆర్టీ నిర్వహించాలి. కొనేళ్లగా అభ్యర్థులు ఉపాధ్యాయుల పోస్టుల కోసం ఎదురుచూస్తున్నరు. ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలి.

– రమావత్ లాల్‌సింగ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

పోస్టుల సంఖ్య పెంచాలి



ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య మరింత పెంచాలి. పోటీకి అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున పునరాలోచించాలి. టీఆర్టీ ప్రకటన కోసం నిరుద్యోగులు ఎంతో మంది ఎదురుచూస్తున్నారు.

– అనిల్, టీఆర్టీ అభ్యర్థి

మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సుభాష్‌నగర్: నగరంలోని రోడ్లు, భవనాలశాఖ అతిథిగృహం మరమ్మతులకు అవసరమైన సామగ్రి, పనులను సమగ్రంగా గుర్తిస్తూ ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. అతిథిగృహంలో ఉన్న వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఎలక్షన్ అబ్జర్వర్లు, ఇతర ఉన్నతాధికారులు పరిశీలనకు హాజరయ్యే అవకాశాలు ఉన్నందున అతిథి గృహంలో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ భవనం ఆధునికీకరణకు ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రాథమికంగా రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయించాలన్నారు. ఆర్ అండ్ బీ అతిథిగృహం ఆవరణలో సుమారు రూ.4కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న నాలుగు సూట్లతో కూడిన భవన నిర్మాణం ప్రతిపాదనలు, స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి. యాదిరెడ్డి, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సోషల్‌సైన్సెస్, కామర్స్ డీన్ల నియామకం



తెయూ(డిచ్‌పల్లి): టీయూ సోషల్ సైన్సెస్ డీన్‌గా ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కామర్స్ డీన్‌గా జి.రాంబాబు నియామకమయ్యారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి నియామక ఉత్తర్వులను శుక్రవారం తన చాంబర్‌లో అందజేశారు. అనంతరం చంద్రశేఖర్, రాంబాబులను ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

సంఘటితంతోనే హక్కుల సాధన

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్



మున్సిపల్ ఫోరం నూతన కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్: ఉద్యోగులు సంఘటితంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోవచ్చని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. నగరంలోని టీఎన్జీవో కార్యాలయంలో కిషన్ అధ్యక్షతన తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల ఫోరం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటుచేశారు. ఉద్యోగులు వారి సమస్యలపై ప్రస్తావించి, చర్చించారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నామని కిషన్ పేర్కొన్నారు.

అనంతరం తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల ఫోరం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా టి. విజయ్ సింగ్, కార్యదర్శిగా ఎల్. శేఖర్, ఉపాధ్యక్షులుగా మోహన్, కోశాధికారిగా దత్తారెడ్డి, 21 మంది జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి అలుక కిషన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణ రెడ్డి, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, సతీశ్‌కుమార్, జి. ప్రభాకర్, వెంకట గోపాల్, జాఫర్ హుస్సేన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

- పొద్దుటూరి వినయ్‌రెడ్డి
- టీపీసీసీ అధ్యక్షుడి సమక్షంలో చేరిక
- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై పోటీచేసే సత్తా వినయ్‌రెడ్డికే ఉంది: రేవంత్‌రెడ్డి



వినయ్‌రెడ్డికి కండువా వేస్తున్న రేవంత్‌రెడ్డి

ఆర్మూర్: సామాన్య ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో వినయ్‌రెడ్డి కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు. ఇటీవల బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేసిన వినయ్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్‌కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కాగా ఆర్మూర్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడానికి సన్నాహాలు చేసినప్పటికీ అనివార్య కారణాలతో సభ రద్దు అయింది. దీంతో సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలతో వినయ్‌రెడ్డి ఆర్మూర్ నుంచి ర్యాలీగా గాంధీ భవన్‌కు తరలివెళ్లాడు. పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి ర్యాలీని ప్రారంభించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వినయ్‌రెడ్డికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పై పోటీ చేయగల సత్తా ఉందని గుర్తించి వినయ్‌రెడ్డిని తానే స్వయంగా పార్టీలో చేరాలని ఆహ్వానించానన్నారు. అనంతరం వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటే అని అన్నారు. మాజీ విప్ ఈరవత్రి అనిల్, టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, నాయకులు కొంతం మురళీధర్ తదితరులు ఉన్నారు.

మానవజన్మ ఎంతో గొప్పది

- ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అన్ని జన్మలోకెల్లా మానవ జన్మ ఎంతో గొప్పదని ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్ అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) కంఠేశ్వర్ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఏసీ భక్తివేదాంత శ్రీల ప్రభుపాద జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానందరాయ్ గౌరదాస్ భక్తులకు ప్రవచనాలు వినిపించారు. శ్రీల ప్రభుపాదుల వారు 1896లో జన్మించారని, 1966లో ఇస్కాన్‌ను స్థాపించి హరేకృష్ణ ఉద్యమాన్ని మొదలుపెట్టారన్నారు. మానవ జన్మతో జ్ఞానాన్ని పెంచుకుని మోక్షాన్ని పొందాలన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ ప్రబోధించిన భగవద్గీతను చదివితే జన్మ సార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో మాదాసు స్వామియాదవ్, నరేశ్, ముకుంద్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల ప్రక్రియ పునాది

- అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా



ఓటరుకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల ప్రక్రియ పునాది లాంటిదని, అర్హులైన ప్రతిఒక్కరూ విధిగా భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు – చేర్పులు, 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవడం, పలు అంశాలపై అధికారులు వివిధ వర్గాల ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా నేతృత్వంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సంఘం కొత్త ఓటర్ల నమోదుకు కల్పిస్తున్న వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై ప్రయోగాత్మకంగా వివరిస్తూ ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల నోడల్ అధికారి సింహాచలం, సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరణ



టీయూలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ఎం.యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): ప్రముఖ రచయిత డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన బీపీ మండల్ జీవిత చరిత్ర పుస్తకాన్ని టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి శుక్రవారం ఆవిష్కరించారు.


బీపీ మండల్ జీవిత చరిత్రపై ఇంతవరకు ఏ రాష్ట్రంలో పుస్తకం విడుదల కాలేదని, తెలుగులో పుస్తకం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, విద్యార్థులు సాయిపవన్, శ్రీకృష్ణ, సంతోష్, శ్రావణ్, ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు బతుకమ్మ కానుకలు



డొంకేశ్వర్(ఆర్మూర్) : బతుకమ్మ చీరలు విడతల వారీగా జిల్లాకు చేరుకుంటున్నాయి. ఇందులో ఆరు మీటర్లు, తొమ్మిది మీటర్ల చీరలున్నాయి. గతేడాది జిల్లాలో 4 లక్షలకు పైగా చీరలను పంపిణీ చేశారు. ప్రస్తుత ఏడాదికి 6,33,116 చీరలు అవసరమని గ్రామీ ణాభివృద్ధి శాఖ అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పంపారు. ఇప్పటివరకు 1,60,700 చీరలు విడతల వారీగా జిల్లాకు చేరుకున్నాయి. ఇందులో ఆరు మీటర్ల చీరలు 1,08,000, తొమ్మిది మీటర్ల చీరలు 52,700 ఉన్నాయి. మిగతా చీరలు కూడా మరో రెండు వారాల్లో జిల్లాకు చేరుకోనున్నాయి. ఈ నెలాఖరులో చీరల పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయి. వచ్చిన చీరలను జాగ్రత్తగా మండల సమాఖ్య భవనాల్లో భద్రపర్చాలని ఏపీఎంలకు ఆదేశాలిచ్చినట్లు డీఆర్డీవో చందర్ నాయక్ తెలిపారు.

వైద్యం వికటించి పసికందు మృతి



పిట్లం(జుక్కల్): ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి పసికందు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మానగర్‌కు చెందిన జైపాల్ అనితలకు నెల పసిబాబు ఉన్నాడు. బాబు ఏడవడం, మోషన్స్ తీవ్రంగా పోతున్నాడని పిట్లంలోని ఓ ఆర్ఎంపీకి చూయించారు. పరీక్షించిన ఆర్ఎంపీ రెండు మందులు రాసిచ్చి పంపించారు. ఇంటికి వెళ్లిన జైపాల్అనిత తమ పసికందుకు మందులు పోశారు. దీంతో బాబు మరింత ఎక్కువగా ఏడవడం, మోషన్స్ పోతూ స్పృహ తప్పాడు. కొద్దిసేపటికి శ్వాస తీసుకోవడం ఆపేసినట్లు గుర్తించే సరికి మృతి చెందాడు. ఆర్ఎంపీ ఇచ్చిన మందులకే తమ బాబు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

క్రైం కార్నర్

చెరువులో పడి యువకుడి మృతి



గాజీరాం (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని చిన్నకొడప్‌గల్ శివారులోని పెద్ద చెరువులో ఓ యువకుడు పడి మృతి చెందినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కారేగాం తండాకు చెందిన గాజీరాం (30) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లిన గాజీరాం తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. స్థానికుల సమాచారం మేరకు పెద్ద చెరువులో మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఇందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మనస్తాపంతో చెరువులో దూకి ఒకరు..



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన నార్లవార్ శంకర్(30) మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మద్నూర్‌కు చెందిన శంకర్ తన తండ్రి లక్ష్మణ్, బావ భార్మజీతో గొడవ జరిగింది. దీంతో తన భర్త మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య కమలాబాయి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతి



ఎడపల్లి(బోధన్): ఎడపల్లికి చెందిన పల్లికొండ సాయవ్వ (60) అనే వృద్ధురాలు స్థానిక చెరువులో పడి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు శుక్రవారం తెలిపారు. చెరువులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గురువారం అదృశ్యమైన సాయవ్వ మృతదేహంగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు..



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల కేంద్రంలో కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి చెందాయి. మండల కేంద్రానికి చెందిన కుర్మ నవీన్, శేఖర్, ఐలయ్యలకు చెందిన 14 గొర్రెలపై గురువారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాయి. సుమారు రూ.1 లక్ష 50 వేలు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

సైబర్ మోసానికి గురైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి నార్కోటిక్ పోలీసుల పేరిట సైబర్ మోసానికి పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెడెక్స్ కొరియర్ కంపెనీకి చెందిన వారిమని మీరు పంపిన పార్సల్‌లో మత్తు మందులు ఉన్నాయని, ఈ కేసులో నార్కోటిక్ పోలీసులు ఇన్వాల్ అయ్యారని చెప్పారు. దీనికి మీ రెండు బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు వేయాలని తెలుపగా రూ.1,97,778 వేసినట్లు తెలిపారు. వారిపై అనుమానం రావడంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు సమాచారం అందించారు.

ప్రజలు ఇలాంటి కాల్స్ వస్తే డబ్బులు వేయొద్దని ఎస్‌హెచ్‌వో సూచించారు. తాము సైబర్ మోసానికి గురైనట్లు తెలిస్తే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఐస్‌క్రీమ్ కంపెనీకి నోటీసులు



భిక్కనూరు: మండల కేంద్రంలో శుభ్రత పాటించని ఐస్‌క్రీమ్ కంపెనీ నిర్వాహకుడికి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత నోటీసులు అందజేశారు. మండల కేంద్రంలోని కిరాణాదుకాణాలు, హోటళ్లు, ఐస్‌క్రీమ్ కంపెనీలను శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతి హోటల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద శుభ్రత పాటించాలని సూచించారు. ఆహార పదార్థాలకు సంబంధించిన లైసెన్స్‌లను పొందాలన్నారు. ఎవరైనా లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై అవగాహన

బోధన్: పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో శుక్రవారం జాతీయ బాలల సైన్స్ కాంగ్రె స్ -2023పై డివిజన్ స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్ సైన్స్ టీచర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ హాజరై, మాట్లాడారు. ఈ నెల 21న నిజామాబాద్‌లో జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంఈవో నాగ్‌నాథ్, ఇందూర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కొడాలి కిషోర్, ఆర్‌పీలు గగన్‌కుమార్, ముద్దుకృష్ణ, గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ థామస్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోయినా పట్టించుకోరా..



నీటితో నిండి ఉన్న పిల్లర్ల గుంతలు

బాల్కొండ: మండలంలోని ఇత్వార్‌పేట్‌లో వీడీసీ భవన నిర్మాణానికి తవ్విన పిల్లర్ల గుంతలో ఇద్దరు చిన్నారులు పడి మృతిచెందినా వాటి గురించి ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. శుక్రవారం సైతం గుంతలో నీరు నిండుగానే ఉంది. ఇటీవల వీడీసీ భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల నిధులను మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్‌గా మాజీ ఉపసర్పంచ్ అవతారమెత్తి పనులను ప్రారంభించాడు.

15 రోజుల క్రితం పిల్లర్ల కోసం గుంతలు తవ్వి రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేశాడు. భారీ వర్షాలు కురవడంతో గుంతల్లో నీరు చేరింది. ఇది గమనించని గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు నాస్తిక్, నిషాంత్ చరణ్ గుంతలో గురువారం పడి మృతి చెందారు. శుక్రవారం సైతం గుంతలో ఉన్న నీటిని తొలగించకపోవడం, రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ. నాలుగు లక్షలకు రెండు ప్రాణాలు..

గుంతలో పడిలో మృతి చెందిన రెండు ప్రాణాలకు రూ. నాలుగు లక్షలకు వెల కట్టినట్లు తెలిసింది. ఈ నగదు సైతం విడతల వారీగా నాలుగు నెలల్లో రెండు కుటుంబాలకు చెల్లించాలని గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం కుదిరినట్లు సమాచారం. చిన్నారుల మృతికి కారణమైన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు.

నేడు కాంగ్రెస్ మండల అధ్యక్షులకు శిక్షణ

ఖలీల్‌వాడి: జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ మండల, బ్లాక్ కాంగ్రెస్ మండలాల అధ్యక్షులకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న ఆర్టీసీ కళ్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పార్టీ మండలాల అధ్యక్షులు శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.